క్లుప్తంగా

వైభవంగా పట్టాభిరామ స్వామి విగ్రహ ప్రతిష్ట

పెద్దారవీడు: మండలంలోని కొత్తూరు పట్టాభిరామస్వామి ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా 28, 29, 30వ తేదీల్లో ధ్వజస్తంభం, సీతలదేవి యంత్రం, బొడ్డురాయి, గమిటిరాళ్లు, పోలేరమ్మ, వినాయకుని విగ్రహాలు, బ్రహ్మంగారి ధ్వజ స్తంభం ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ ప్రజలు గురువారం తెలిపారు. దత్తదుర్గ ఉపాసకులు భాస్కర స్వామిజీ ఆధ్వర్యంలో 28న ఉదయం యాగశాల ప్రవేశం, గణపతిపూజ, అగ్ని ప్రతిష్టాపన, పుణ్యాహవాచనం, పంచకవ్యం, విగ్రహాలకు కంకణం, జలాధివాసం, 29న విగ్రహాల గ్రామోత్సవం, పాలాభిషేకం, ధాన్యధివాసం, 30న ఉదయం 7.02 నిమిషాలకు యంత్ర ప్రతిష్టాపన, ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్టాపనలు, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 28, 29, 30వ తేదీల్లో అన్నదానం, సాయంత్రం జైశ్రీరామ్ కోలాటం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

గిద్దలూరు తహసీల్దార్‌గా విజయకుమారి

● ఎమ్మెల్యే అన్నాను కలిసిన తహసీల్దార్



ఎమ్మెల్యే అన్నాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ విజయకుమారి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నూతన తహసీల్దార్‌గా కె.విజయకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. నగర పంచాయతీ కమిషనర్ వై.రామకృష్ణ, ఇతర అధికారులు కలిసి స్వాగతం పలికారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, వీఆర్‌ఓలు పద్మావతి, ఈశ్వరరెడ్డి, స్వర్ణలతారెడ్డి ఉన్నారు. గిద్దలూరు మండల నూతన తహసీల్దార్‌గా నియమితులైన కె.విజయకుమారి.. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాటిచెర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అన్నా వెంకట రాంబాబు పర్యటిస్తుండగా తహసీల్దార్ కె.విజయకుమారి అక్కడకు చేరుకుని ఆయనతో మాట్లాడారు. మండల రెవెన్యూ పరిస్థితులపై ఎమ్మెల్యే అన్నాతో కొద్దిసేపు చర్చించారు. వీరి వెంట జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయిళ్ల జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఎస్‌ఐ సంపత్‌కుమార్, స్థానిక సర్పంచ్ ముక్కమళ్ల శ్రీనివాసరెడ్డి స్పందించారు. ప్రమాదాల జరిగేందుకు కారణాలు తెలుసుకునేందుకు బ్రిడ్జి వద్ద హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ విధులు నిర్వహించారు. అక్కడ రోడ్డు దెబ్బతినడంతో వేగంగా వస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు గుర్తించారు. గురువారం బ్రిడ్జి వద్ద దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గోతుల వద్ద మట్టి పోయించారు.

వైఎస్సార్ చొరవతో విప్లవాత్మక మార్పులు

● గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



అన్నా రాంబాబు

మార్కాపురం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చొరవతో 2004 నుంచి విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గురువారం రాత్రి కిట్స్ కళాశాల 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంటు పథకంతో ఉన్నత విద్య ఉచితంగా పేద విద్యార్థులకు అందిందన్నారు. ఈ పథకంలో ఇంకా మార్పులు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారన్నారు. కష్టపడి విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, గురువులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ అన్నా క్రిష్ణ చైతన్య, అన్నా అనూష, డీఎస్పీ డాక్టర్ ఎం. కిషోర్‌కుమార్, ఎ–1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీబేగ్, విహెచ్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమా రెడ్డి , ప్రముఖ వైద్యుడు డాక్టర్ మక్బుల్ బాష, సీఐ భీమా నాయక్, ఎస్సైలు శశికుమార్, రాజేష్ , ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెన్నా క్రిష్ణా రెడ్డి, ఉషా ఈశ్వరన్, డాక్టర్ అన్నా రంగనాయకులు, ఏవో ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళలకు డ్రెస్ మేకింగ్‌పై శిక్షణ

ముండ్లమూరు: మండలంలోని ఈదరలో గురువారం మహిళలకు డ్రెస్ మేకింగ్ కోసం కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆశక్తి ఉన్న మహిళలకు మూడు నెలలు డ్రెస్ మేకింగ్‌లో ఇచ్చే శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ వంగల పద్మావతి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్యామ్ సునీల్, డీబీఆర్‌సీ జిల్లా కార్యదర్శి దార్ల కోటేశ్వరరావు, కో ఆర్డినేటర్ గోపనబోయిన వెంకటరావు సుశీల, రమేష్ పాల్గొన్నారు.

పేదలు మెచ్చిన నేత వైఎస్ జగన్

● డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



ప్రభ నుంచి మాట్లాడుతున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ

కురిచేడు: రాష్ట్రంలోని పేదలకు గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసి ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి ఒక్కరేనని దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎస్‌ఎస్‌పీ అగ్రహారంలో బుధవారం రాత్రి శ్రీ అంకాళ పరమేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ మీదకు జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆయన వచ్చారు. దివంగత నేత వైఎస్సార్ పాలనను మరిపించేలా పాలన కొనసాగిస్తూ ప్రజల మనసులో పదిలమైన స్థానం సంపాదించుకున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డిని ఆదరిస్తూ ఆయన వెంట కొనసాగాలని కోరారు. ఒక్కసారి కూడా ఎమ్మెల్యే కాని వ్యక్తి నేరుగా పాదయాత్ర చేసి ముఖ్యమంత్రి కావాలని తపన పడటం హాస్యాస్పదమన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న చంద్రబాబు నేటికీ అబద్ధాలు, మోసపూరిత మాటలు మార్చుకోలేదన్నారు. ఆయన మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. సినిమా హీరో అయినంత మాత్రాన ప్రజల్లో హీరో కావటం కష్టమని పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి అన్నారు. రీల్ హీరో ఆయన అయితే రియల్ హీరో వైఎస్ జగన్ మోహనరెడ్డి మాత్రమేనన్నారు. పార్టీని బలోపేతం చేసుకుంటూ వైఎస్ జగన్‌మోహనరెడ్డికి అండగా నిలిచి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, అగ్రహారం మాజీ సర్పంచ్ పాతకోట శేషమ్మ, తాటి చెంచయ్య, డాక్టర్ బాషా, నాయకులు కొలూరి నర్సింహ, పెండ్యాల గుర్నాథం, పాతకోట వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వీరగంథం కోటయ్య, గోగులమూడి లింగారెడ్డి, ఆసుపల్లి భాస్కరరెడ్డి, ఇందూరి వెంకట నర్సిరెడ్డి, ఆసుపల్లి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి సురేష్ జన్మదిన వేడుకలు



మంత్రి సురేష్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన కృష్ణ, షంషేర్



కేక్ కట్ చేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

● హాజరైన ఎమ్మెల్యేలు కేపీ, అన్నా

మార్కాపురం: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఉదయం క్యాంప్ కార్యాలయంలో, ఫార్మసీ కళాశాలలో జరిగిన కార్యక్రమాల్లో మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కేపీ నాగార్జున రెడ్డి, అన్నా వెంకటరాంబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కౌన్సిలర్లు, పలువురు పట్టణ, జిల్లా స్థాయి అధికారులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ట్విట్టర్‌లో మంత్రిసురేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన సోదరుడు డాక్టర్ ఆదిమూలపు సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ రాజబాబు, పెద్దారవీడు, పెద్ద దోర్నాల మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నియోజకవర్గ అధికారులు మంత్రి సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

యర్రగొండపాలెం: మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక రోడ్లు, భవనాలశాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తనయుడు ఆదిమూలపు విశాల్‌తో కలిసి 60 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. నియోజకవర్గంలోని పలువురు అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, లాజర్, జెడ్పీటీసీ సభ్యుడు చేదూరి విజయభాస్కర్, ఎం.జాన్‌పాల్, వాగ్యానాయక్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, మండల సభ్యుడు విజయకుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు డి.సుబ్బారెడి, జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి బి.బాలచెన్నయ్య, రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక విభాగం డైరెక్టర్ ధనలక్ష్మిబాయి, ఆర్యవైశ్య సంఘ నాయకులు సూరె రమేష్, కందూరి కాశీవిశ్వనాథ్, పబ్బిసెట్టి శ్రీనివాసులు, సూరె వెంకటస్వామి, కందూరి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఎల్లారెడ్డి రోషిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, డి.గోపాల్‌రెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్.పిచ్చయ్య, ఆయా మండలాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దదోర్నాల: మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పుట్టిన రోజు వేడుకలు మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సర్పంచ్ చిత్తూరి హారిక ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, ఉప సర్పంచ్ దూదేకుల రసూల్‌తో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ మండల నాయకులు యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, యక్కంటి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ జోగి వెంకట నారాయణ పాల్గొని కేక్‌ను కట్ చేశారు. మార్కాపురంలో జరిగిన వేడుకల్లో మండల పార్టీ కన్వీనర్ గంటా రమణారెడ్డి, నాయకులు అబ్దుల్ మజీద్, గుమ్మా యల్లేష్, లతా చంద్రకాంత్ నాయక్ పాల్గొని మంత్రి ఆదిమూలపు సురేష్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి సురేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు



పెద్దదోర్నాలలో..

నవరత్నాలతో ప్రతి కుటుంబంలో ఆనందం

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



సంక్షేమ ఫలాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కొమరోలు: నవరత్నాల పథకాలు అర్హులకు అందుతున్నాయని, ఆ పథకాల ద్వారా ఆయా కుటుంబాల్లో సంతోషం వెల్లువిరుస్తోందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని తాటిచెర్లలో గురువారం 99వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత తాటిచెర్లలో ఎమ్మెల్యే అన్నాకు ఘన స్వాగతం పలికి మహిళలు హారతులిచ్చారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేస్తూ ప్రభుత్వ పనితీరును వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియచేసి వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులే ముఖ్యమంత్రి జగనన్న బలమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో 100 శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు, తాటిచెర్ల సర్పంచ్ బొమ్మని రంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు అలెగ్జాండర్, బత్తుల ప్రవీణ్, వెంగయ్యచౌదరి పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



మహిళల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి టౌన్: అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సూచించారు. దర్శి పట్టణం 4వ సచివాలయం పరిధి పుట్టబజారులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. వారికి అందిన లబ్ధిని తెలుపుతూ బుక్‌లెట్ అందించారు. అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ అర్హత ఉండి సాంకేతిక లోపాలతో ఆగిన లబ్ధిని తిరిగి పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగనన్నను ఆశీర్వదించి 2024లో మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, కార్యదర్శి గోను నారాయణరెడ్డి, కౌన్సిలర్లు వీసీరెడ్డి, మోహన్‌రెడ్డి, మోహన్‌బాబు, బాబు, నారాయణరెడ్డి, ముత్తినీటి సాంబయ్య, దారం వాసుదేవరెడ్డి, యర్రయ్య, కట్టికోట హరీష్, అన్నవరపు రవి, శేషం రమణయ్య, కోటయ్య, ఎస్.శ్రీనివాసరెడ్డి, కిక్కి రమణారెడ్డి, పాణేం రెహమాన్, అంబటి వెంకటేశ్వరరెడ్డి, మిల్లర్ బుజ్జి, పాశం జయసింహ, గురవయ్య, కాలేషావలి, జేసీఎస్ కన్వీనర్ ఎదురు కోటిరెడ్డి, సొసైటీ చైర్మన్ వేమిరెడ్డి చెన్నారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మురళి, డిప్యూటీ తహసీల్దార్ ఆకుల రవి, ఏడీఈ పిచ్చయ్య, ఏఈ ప్రసాద్, హౌసింగ్ ఏఈ షాకీర్, వీఆర్‌ఓ మురళి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు



గడప గడపలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: తల్లి బాగున్నావా... అవ్వా పింఛన్ వస్తుందా...అక్క ఆసరా పథకం వచ్చిందా అంటూ ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి గురువారం మండలంలోని చెన్నారెడ్డి పల్లె గ్రామంలో 3వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. అర్హులైన అందరికీ నవరత్నాల పథకాలు వస్తున్నాయన్నారు. రైతు భరోసా, ఆసరా, జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీపై పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ భూలక్ష్మిరాసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వరకుమార్, ఎంపీడీఓ యస్.నరసింహులు, ఏపీఎం పిచ్చయ్య, పలువురు అధికారులతో పాటు సర్పంచ్ మురారి సుబ్బమ్మ, ఎంపీటీసీ వెంకటయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లైన ఆంజనేయులు, రమణారెడ్డి, శ్రీనివాస రెడ్డి, శికోమణి, రామిరెడ్డి, పెద్ద మస్తాన్, కాశయ్య, బాలసుబ్బమ్మ, నవ్వారమణయ్య, కోఆప్షన్ సభ్యులు అక్బర్‌అలీ, ఎంపీటీసీలు వెంకటయ్య, పార్వతి రమేష్‌రెడ్డి, అంకమ్మ, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయ రెడ్డి, నాయకులు కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, హరి, శేషయ్య, ఎబినేజర్, ఇంద్ర పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగనన్న'



పొదిలి: టైలర్స్ కాలనీలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న నాయకులు



సిద్ధవరం ఎస్సీ కాలనీలో..

కొనకనమిట్ల: మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దెత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గురువారం నాయుడుపేట, నాగంపల్లి, నాగరాజుకుంట, కాట్రగుంట, సిద్ధవరం ఎస్సీ కాలనీలలో కరపత్రాలు అందజేశారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ శంకర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అర్ధవీడు (గిద్దలూరు రూరల్): మండలంలోని పెద్దకందుకూరులో జెడ్పీటీసీ చెన్ను విజయ ఆధ్వర్యంలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా జగనన్నతో కూడిన స్టిక్కర్‌ను అతికిస్తూ ప్రచారం చేశారు. ఎంపీటీసీ అనంతరావు, కన్వీనర్ ఏరుగ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పొదిలి రూరల్: మండలంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నరు. గురువారం మండలంలోని సలక నూతలలో నారాయణరెడ్డి, శాంసన్, తిరుపతి స్వామి, మల్లవరంలో రెడ్డెబోయిన వెంకటేశ్వర్లు, రెడ్డెబోయిన సుబ్బయ్య, పట్టణంలో టైలర్స్ కాలనీలో సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఎస్.కె. రబ్బానీ అధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలకు వివరించి.. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని చెప్పారు. ఇంటి యజమాని సెల్‌ఫోన్‌తో 82960 82960 నంబరుకు మిస్డ్‌కాల్ ఇచ్చి, వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు.

రైతు ఆత్మహత్యపై త్రీమెన్ కమిటీ విచారణ



విచారణ చేస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: మండలంలోని గజ్జలకొండ పంచాయతీ పరిధిలోని మాలపాటిపల్లె గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు గొలమారి కోటిరెడ్డి ఇంటి వద్ద త్రీమెన్ కమిటీ సభ్యులు గురువారం విచారణ చేశారు. ఈ కమిటీలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, ఎస్‌ఐ సుమన్, తహసీల్దార్ హరిబాబు ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్న కోటిరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులతో మాట్లాడి ఆత్మహత్యకు గల కారణాలు, అప్పులు, పంటల సాగు తదితర వివరాలను తెలుసుకున్నట్లు వ్యవసాయాధికారి శ్రీనివాసులు తెలిపారు. నివేదికను ప్రభుత్వానికి పంపి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఆర్‌ఐ రమణ, వీఆర్‌ఓలు శివపార్వతి, రఫీ హజరయ్యారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గోపాల్‌రెడ్డి

త్రిపురాంతకం: స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడిగా దగ్గుల గోపాల్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గుర్రం బాబూరావు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. వీరిని ఘనంగా పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూడాలి

తాళ్లూరు: గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేలో, అసైన్‌మెంట్ కమిటీలో రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులు కృషి చెయ్యాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎంపీపీ చాంబర్‌లో రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ రామ్మోహన్‌రావు సమక్షంలో గ్రామ రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

తర్లుపాడు: మాజీ ఎంపీపీ కుందూరు వెంకటరెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా స్థానిక షిర్డీ సాయి మందిరంలో కుమారుడు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హజరయ్యారు. ముందుగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ భూలక్ష్మి రాబసుబ్బా రెడ్డి, సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు పి. వరాలు, రమణారెడ్డి, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, గాయం శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీ అంకమ్మ, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఎబినేజర్, టెంపుల్ చైర్మన్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించండి

మార్కాపురం: విద్యార్థులకు మంచి విద్యను అందించాలని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో యూకేజీ నుంచి 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, లక్ష్యసాధన, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పించాలని, క్రీడలపై ఆసక్తి పెంచాలని సూచించారు. వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. ప్రిన్సిపాల్ టి. శ్రీనివాసరావు, ఏజియం అంజయ్య, ఆర్‌ఐ అనీల్‌కుమార్, కోఆర్డినేటర్ మల్లికార్జున్, డీన్ సి.హెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టైర్ పంక్చరై మినీ వ్యాన్ బోల్తా

కొమరోలు: టయర్ పంక్చర్ కావడంతో వేగంగా వెళ్తున్న మినీ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటన మండలంలోని హసనాపురం సమీపంలో అమరావతి–అనంతపురం జాతీయ రహదారిపై గురువారం జరిగింది. బేస్తవారిపేట వైపు నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న మినీ వ్యాన్ టయర్ పంక్చర్ కావడంతో రహదారికి అడ్డంగా బోల్తా పడింది. కొద్దిసేపు వాహనాలు నిలిచాయి. జేసీబీ సాయంతో బోల్తాపడిన మినీ వ్యాన్‌ను పక్కకు తొలగించారు. వాహన డ్రైవర్ రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

పాఠశాల అభివృద్ధిలో కాశిరెడ్డి కీలక పాత్ర



కాశిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు ఉన్నత విద్యను అందించటమే లక్ష్యంగా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి పని చేస్తారని ఎంఈఓ ఎస్.కె దాంగే షరీఫ్, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు దాసరి గురుస్వామి, యూటీఎఫ్ జిల్లా నాయకులు అబ్దుల్‌హై అన్నారు. గురువారం కొనకనమిట్ల ఏపీ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.కె.జి మస్తాన్ పర్యవేక్షణలో పాఠశాల వార్షికోత్సవం, గతంలో జిల్లా ఉత్తమ హెచ్‌ఎంగా అవార్డు అందుకున్న గాయం కాశిరెడ్డికి నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు కలిసి పాఠశాలను అందంగా తీర్చిదిద్దారని వక్తలు కొనియాడారు. హెచ్‌ఎం కాశిరెడ్డి దంపతులను సన్మానించారు. ఉప సర్పంచ్ మెట్టు అల్లూరురెడ్డి, మాజీ సర్పంచ్ పునుగోటి కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వాడవాడలా జగనన్నే మా భవిష్యత్తు

పొదిలి రూరల్: మండలంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నరు. గురువారం మండలంలోని సలక నూతలలో నారాయణరెడ్డి, శాంసన్, తిరుపతి స్వామి, మల్లవరంలో రెడ్డెబోయిన వెంకటేశ్వర్లు, రెడ్డెబోయిన సుబ్బయ్య, పట్టణంలో టైలర్స్ కాలనీలో సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, ఎస్.కె. రబ్బానీ అధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలకు వివరించి.. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని చెప్పారు. కుల మత రాజకీయం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు ఇచ్చి నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి నగదు జమ చేస్తున్నామని తెలిపారు. ఇంటి యజమాని సెల్‌ఫోన్‌తో 82960 82960 నంబరుకు మిస్డ్‌కాల్ ఇచ్చి, వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు.

రీసర్వే భూహక్కు పత్రాల పంపిణీ

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురంలో జగనన్న భూహక్కు పత్రాలను తహసీల్దార్ నయీం అహ్మద్ గురువారం పంపిణీ చేశారు. ఇటీవల శంకరాపురంలో రీసర్వే పూర్తి కాగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నూతన భూహక్కు పత్రాలు మంజూరు చేసింది. వాటిని సంబంధిత రైతులకు రెవెన్యూ సిబ్బంది అందజేశారు. రీ సర్వేతో రైతులకు సకాలంలో భూహక్కు పత్రాలు వచ్చినట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలం పెండింగ్ భూసమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. రీసర్వే డీటీ రవికాంత్, వీఆర్వో అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.